క్లుప్తంగా

హత్నూర పోలీస్‌స్టేషన్ తనిఖీ



పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించిన ఎస్పీ

హత్నూర (సంగారెడ్డి): హత్నూర పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఎస్పీ పరితోష్ పంకజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లోని రికార్డుల పరిశీలన, కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పోలీసు సిబ్బంది ప్రజలకు అందుబాటులో కనిపించాలని సిబ్బందికి సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలతో పోలీసులు, సిబ్బంది స్నేహపూర్వకంగా ఉండి సహకరించాలని సూచించారు. ఎస్‌ఐ సుభాష్, సిబ్బందితో మాట్లాడి మండల పరిస్థితులను తెలుసుకున్నారు.

ధర్మ రక్షణకు పాటుపడాలి

నారాయణఖేడ్: ధర్మరక్షణకు దయ, ప్రేమ, సత్యం, శీలం, అహింసా విధానాలు సోపానాలు అని రాంపూర్ ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి అన్నారు. ఖేడ్‌కు సోమవారం వచ్చిన సందర్భంగా సత్యనారాయణస్వామి ఆలయంలో ఆవరణలో భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. మానవుడిగా ధర్మరక్షణకు కృషి చేయాలన్నారు. ప్రస్తుతం ధర్మానికి ఇబ్బంది కలుగుతుందని, కొన్ని శక్తులు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు.

పీహెచ్‌సీ వైద్యుడికి పీహెచ్‌డీ పట్టా

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆయుర్వేద వైద్యుడు గణపతిరావు రాజీవ్ గాంధీ ఆరోగ్య విశ్వవిద్యాలయం (కర్నాటక)నుంచి పీహెచ్‌డీ పట్టా సాధించారు. భగంధర వ్యాధి పలాశ క్షార సూత్ర చికిత్స పరిశోధనకు గణపతిరావుకు విశ్వ విద్యాలయం పీహెచ్‌డీ పట్టా ఇవ్వనుంది. ఈనెల 6న కర్నాటక రాష్ట్ర గవర్నర్ తవర్‌చంద్ గెహ్లాట్ చేతుల మీదుగా పట్టాను అందుకోనున్నాడు.

ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వవిద్యార్థులు, గురువులు

హత్నూర(సంగారెడ్డి):హ త్నూర మండలం దౌల్తాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల పూర్వ విద్యార్థులు సోమ వారం సమ్మేళనం నిర్వహించుకున్నారు. 2005- 2006 సంవత్సరం పదో తరగతి విద్యార్థులు మ ల్కాపూర్ శివారులోని ఓ గార్డెన్ లో కలుసుకొని సమ్మే ళనం ఘ నంగా జరుపుకొన్నారు. అప్పటి ఉపాధ్యాయు లను శాలువా పూలమాలలతో సన్మానించారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకొని సంతోషంగా గడిపారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు.

లక్ష్యాన్ని సాధించే వరకు విశ్రమించొద్దు

సంగారెడ్డి రురల్: విద్యార్థులు తమ లక్ష్యాన్ని సాధించేవరకు విశ్రమించొద్దని తెలంగాణ యువజన సంఘాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణుగోపాల్ కృష్ణ అన్నారు. సోమవారం సంగారెడ్డిలోని నారాయణ స్కూల్‌లో పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులను, వారి తల్లిదండ్రులను సన్మానించి వారికి మెమోంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితంలో ఎంత కష్టమొచ్చినా, దుఃఖం వచ్చినా అనుకున్న లక్ష్యాన్ని సాధించేంతవరకు వెనకు తగ్గదనొ విశ్రామించకుండా మీ యొక్క లక్ష్యసాధనలో ముందుకు సాగాలని తెలిపారు. తల్లిదండ్రులు విద్యార్థులు అభిరుచికి తగట్టు ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసుకొని వారిని ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో ఐసీ మోహన్, వల్లి, కుమార్, లక్ష్మణ్, కనకరాజు, ధర్మరాజు పాల్గొన్నారు.

దరఖాస్తులు సమర్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సత్తయ్య

కంగ్టి(నారాయణఖేడ్): రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తు చేసుకొన్న సభ్యులు ఎంపీడీఓ కార్యాలయం, సంబంధిత పంచాయతీ సెక్రటరీలకు దరఖాస్తు ఫారాలు సమర్పించాలని ఎంపీడీఓ సత్తయ్య తెలిపారు. కంగ్టి ఎంపీడీఓ సమావేశ మందిరంలో సోమవారం మండల కమిటీ బాధ్యులు, పంచాయతీ సెక్రటరీలతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో అన్ని కార్పొరేషన్‌లకు మొత్తం 1384 మంది యువకులు దరఖాస్తు చేసుకొన్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు కులం , ఆదాయం, రేషన్, ఆధార్, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పట్టాదార్ పాస్‌బుక్, బ్యాంక్ ఖాతా జిరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు సమర్పించాలని తెలిపారు.

సేంద్రియ ఎరువు.. చేనుకు బలం!

తగ్గిన పేడ నిల్వలు

- పెరిగిన ఎరువుల ధరలు
- ఆందోళన చెందుతున్న రైతులు



పశువుల ఎరువు



ట్రాక్టర్‌లో పొలాలకు తరలిస్తున్న పశువుల ఎరువు

జహీరాబాద్ టౌన్: చేనుకు చేవా.. పంటకు బలమని రైతులు పశువుల పేడ ఎరువు కొనడానికి ఆసక్తి చూపుతుంటారు. రసాయన ఎరువుల కన్న పశువుల ఎరువులకు ఎప్పుడు డిమాండ్ ఉంటుంది. భూసారం పెరిగి పంటకు బలం వస్తుందని ఖరీఫ్ సీజన్‌కు ముందు రైతులు పశువుల ఎరువును కొనుగోలు చేసి పంట పొలాల్లో చల్లి పంటల సాగుకు సిద్ధం చేస్తారు. సీజన్ ప్రారంభానికి సమయం దగ్గర పడుతుండడంతో రైతులు దుక్కులు చేస్తున్నారు. పశువుల ఎరువుకు డిమాండ్ పెరగడం అందుకు తగ్గట్టు నిల్వలు లేక ధరలకు రెక్కలు వచ్చాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జహీరాబాద్ డివిజన్ పరిధిలోని రైతులు ఖరీఫ్‌లో పత్తి, కంది, జొన్న, పెసర, వాణిజ్య పంటలైన అల్లం, పసుపు, చెరకు, ఆలు తదితర పంటలు అధిక విస్తీర్ణంలో సాగు చేస్తుంటారు. రైతులు రసాయన ఎరువులతో పాటు పశువుల ఎరువును కూడా పంటలకు వేస్తుంటారు. పశువుల ఎరువు వల్ల భూసారం పెరిగి పంటల దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని రైతుల నమ్మకం. పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంటను వినియోగిస్తుంటారు. ప్రతి సంవత్సరం పశువుల ఎరువులు ధర గణనీయంగా పెరుగుతోంది. పశువుల ఎరువు కొనాలనే రైతులకు ఆర్థిక భారం పడుతుంది. గత సంవత్సరం కన్న ఈ ఏడాది ధర ఎక్కువగా పెరిగింది. కిందటి సంవత్సరం గేదెల పేడ ఎరువు రూ. 12 వేలు ఉండగా ఈ సంవత్సరం రూ. 18వేలకు పెరిగింది. మేకలు, గొర్రెల ఎరువు లారీ లోడ్‌కు రూ. 30 నుంచి రూ. 40 వేలకు చేరుకుంది.

డిమాండ్ పెరిగింది.

అల్లం, పసుపు తదితర పంటలకు పశువుల ఎరువును తప్పకుండా వాడుతారు. అందుకు ఎరువులకు డిమాండ్ పెరిగింది. పల్లెల్లో పశుపోషణ కూడా తగ్గడంతో ఎరువుల నిల్వలు తగ్గి ధర పెరిగింది. పశువుల ఎరువు అల్లం, పసుపు వాణిజ్య పంటలకు వేయడం వల్ల పంటదిగుబడి గణనీయంగా పెరుగుతుంది. అధిక ధర పలుకుతున్న రైతులు పశువులఎరువు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు.

ధర పెరిగిన కొంటున్నాం

పశువుల ఎరువు కొరత వల్ల డిమాండ్ పెరిగింది. అధిక ధరలకు అమ్ముతున్నారు. పశువుల ఎరువులతో పంట దిగుబడి పెరుగుతుంది. అల్లం, పసుపు. ఆలు ఇతర పంటలకు పశువుల ఎరువు తప్పకుండా వేయాలి. ఎరువు ధర పెరుగుతున్న రైతులు కొనక తప్పడం లేదు. రసాయన ఎరువుల కన్న పశువుల ఎరువు వల్ల భూసారం పెరిగి పంట దిగుబడి ఎక్కువగా వస్తుంది.

– శివాజీ రాథోడ్, రైతు, జహీరాబాద్

ప్రజా సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సమీక్షలో నిర్వహిస్తున్న చింతా ప్రభాకర్

సంగారెడ్డి: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం సంగారెడ్డి మున్సిపల్ అధికారులతో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీటి సరఫరా అంశంలో నెలకొన్న ఇబ్బందులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పట్టణ పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, రానున్న వానాకాలంలో దృష్ట్యా పూడికలు తీసి రహదారులపై వర్షపు నీరు నిల్వకుండా చూడాలన్నారు. డంపింగ్ యార్డు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌవన్, డీఈఈ ఇంతియాజ్ , ఆర్.వెంకటేశ్వర్లు, జీవి శ్రీనివాస్, విఠల్ ,శ్రవణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ పత్రం అందజేస్తున్న తట్టునారాయణ

జహీరాబాద్ టౌన్: మండలంలోని బుర్దిపాడ్‌కు చెందిన గుమ్మాల బాలరాజుకు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ రూ.2లక్షల ఎల్‌ఓసీని అందజేశారు. బాలరాజ్ అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆర్థిక సహాయం కోసం ఎమ్మెల్యే మాణిక్‌రావును కలసి వినతి పత్రం ఇచ్చారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం బాధిత కుటుంబానికి మండల నాయకులు ఎల్‌ఓసీ అందజేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

మొగుడంపల్లి మండలంలోని నందునాయక్ తండాకు చెందిన ప్రేమ్‌రాథోడ్ అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. సీఎం సహాయనిధి నుంచి మంజూరయిన రూ.60వేల చెక్కును కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మక్బూద్ అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీఎఫ్ రాష్ట్ర నాయకులు వినాయక్ పవార్, నాయకులు శుక్తవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిశ్రమల ఏర్పాటుతో వలసల నివారణ

ఎమ్మెల్సీ నేలికంటి సత్యం



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సత్యం

నారాయణఖేడ్: అన్ని రంగాల్లో వెనుకబడిన నారాయణఖేడ్ నియోజకవర్గంలో పరిశ్రమలను ఏర్పాటు చేసి వలసలను నివారించాలని సీపీఐ పార్టీ ఎమ్మెల్సీ నేలికంటి సత్యం అన్నారు. ఖేడ్‌లో సోమవారం సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మంజీరానది ఈ ప్రాంతం మీదుగానే ప్రవహిస్తున్నందున జలాలను ఈప్రాంత సాగు, తాగునీటి అవసరాలకు ఇవ్వాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లపాలనలో అభివృద్ధిని వెనుకకు నెట్టివేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్న పూర్తి నమ్మకం తమకు ఉందన్నారు. ఆగస్టు 3న సీపీఐ పార్టీ జిల్లా మహాసభలను నారాయణఖేడ్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనే ప్రధాన ఏజెండాగా ఉంటుందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గస భ్యులు ఈటీనర్సింహా, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు యూసూఫ్, జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలొద్దీన్, సహాయ కార్యదర్శి ఆనంద్, కార్యవర్గ సభ్యులు రహిమాన్, దత్తురెడ్డి, చిరంజీవి, అశోక్, పుప్పాలఅశోక్, ఇసాక్ పాల్గొన్నారు.

పెట్రోల్ బంకులపై చర్యలు తీసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న గణపతి

నారాయణఖేడ్: సదుపాయాలు లేని పెట్రోల్ బంకులపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గణపతి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వాహనాల్లో గాలి నింపడం, మూత్రశాలలు, మరుగుదొడ్ల సదుపాయాలు కల్పించాల్సి ఉండగా ఖేడ్ ప్రాంతంలోని అత్యధిక బంకుల్లో అలాంటివి లేవన్నారు. మ్యాన్‌పవర్ సైతం నిబంధనలకు అనుగుణంగా ఉండటం లేదని తెలిపారు. నిబంధనలను విధిగా అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సంఘ నాయకులు రమేష్, రఘు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తి మృతికి సంతాపం



మౌనం పాటిస్తున్న న్యాయమూర్తి, న్యాయవాదులు

నారాయణఖేడ్: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఎం.జి. ప్రియదర్శిని మృతిపై ఖేడ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి శ్రీధర్ మంథాని ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదులు సంతాపం ప్రకటించారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతికలగాలని న్యాయవాదులు రెండు నిముషాల పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భోజిరెడ్డి, సీనియర్ న్యాయవాదులు మారుతిరెడ్డి, నర్సారెడ్డి, లక్ష్మణ్‌రావు, సంగమేశ్వర్‌రెడ్డి, సుధాకర్, సాయిలు, జీవన్ కుమార్, భువనేశ్వరి పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనుల పరిశీలన



కేంద్ర మంత్రి గడ్కరీతో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని వాణినగర్, లాలాబావి, పెద్ద చెరువు మీదుగా బంధం కొమ్ము వరకు చేపడుతున్న రహదారి విస్తరణ పనులను త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి రహదారి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా రూ. 23 కోట్లతో రహదారి విస్తరణ పనులను చేపడుతున్నట్లు తెలిపారు. బంధం కొమ్ము పరిధిలో విద్యుత్ స్తంభాల తరలింపు, నూతన లైన్‌ల ఏర్పాటుకు 4 కోట్ల 70 లక్షల రూపాయలను కేటాయించామన్నారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పనుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి, ఎమ్మార్వో వెంకటస్వామి, మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, విద్యుత్‌శాఖ డీఈ భాస్కర్‌రావు, మున్సిపల్ ఇంజనీరింగ్ డీఈ వెంకటరమణ, మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పటాన్‌చెరులో ఫ్లైఓవర్ నిర్మించండి

పటాన్‌చెరు: జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పట్టణంలో వ్యాపారస్తులు, స్థానికులకు నష్టం జరగకుండా ఫ్లైఓవర్ నిర్మించాలని కేంద్ర రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని సోమవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కలిసి వినతి పత్రం అందజేశారు. బీహెచ్‌ఈఎల్ వద్ద రూ.136 కోట్లతో నూతనంగా నిర్మించిన బీహెచ్‌ఈఎల్ - లింగంపల్లి నూతన ఫ్లైఓవర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన కేంద్ర మంత్రి గడ్కరీని ఎమ్మెల్యే కలిశారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి విస్తరణ కారణంగా ఎదురయ్యే ఇబ్బందులను వినతిపత్రంలో కేంద్ర మంత్రికి తెలియజేశారు. ప్రధానంగా వ్యాపార సంస్థలకు తీవ్రనష్టం వాటిల్లుతుందనిఆయన దృష్టికి తీసుకెళ్లారు.

పాకిస్తాన్ పౌరులను గుర్తించండి



డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

పటాన్‌చెరు టౌన్: నియోజకవర్గ పరిధిలో పాకిస్తాన్‌కు చెందిన పౌరులుంటే గుర్తించి స్వదేశానికి పంపాలని బీజేపీ మండల అధ్యక్షుడు వీరేశం అన్నారు. సోమవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పిలుపు మేరకు బీజేపీ శ్రేణులతో కలిసి పటాన్‌చెరు డీఎస్పీ, తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు అల్లం రాజారెడ్డి, జగన్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు రమేష్ యాదవ్, నాయకులు నాగరాజు, వేణుగోపాల్, మల్లేశం, సంజీవ్‌కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

పాకిస్తాన్‌కు పంపండి

సంగారెడ్డి టౌన్: జిల్లా, పట్టణంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్ పౌరులను గుర్తించి వారి దేశానికి పంపించాలని బీజేపీ ఆధ్వర్యంలో సంగారెడ్డి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాగరాజు మురళీధర్ గోవింద్ బాబ, శివ పాల్గొన్నారు.

రైతులను చైతన్య పర్చాలి

ఆత్మకమిటీ చైర్మన్ కచూర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న కచూర్‌రావు

రాయికోడ్(అందోల్): వ్యవసాయంలో అధిక దిగుబడులు పొందేలా ఆత్మకమిటీ సభ్యులు రైతులను చైతన్యపర్చాలని రాయికోడ్ ఆత్మకమిటీ చైర్మన్ కచూర్‌రావు అన్నారు. సోమవారం ఆత్మకమిటీ ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయం, అనుబంధ రంగాలకు సాంకేతికతను జోడించి లాభాలు పొందడంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆత్మకమిటీ లక్ష్యాలు, సేవలపై ప్రతి సభ్యుడు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏడీఏ సత్యనారాయణ మాట్లాడుతూ.. పంటల సాగులో మోతాదుకు మించి ఎరువుల వినియోగించరాదన్నారు. భూసారాన్ని కాపాడుకోవడం బాధ్యతగా భావించాలని రైతులను తెలిపారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు పొందెందుకు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు కొనసాగించాలన్నారు. అందుకు వ్యవసాయశాఖ, ఆత్మ అధికారుల సేవలను వినియోగించుకోవాలన్నారు. ఫార్మర్ రిజిస్టర్ వచ్చే నెల 5 వరకు చేపడతామన్నారు. పత్తి సాగులో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై ఏఓ సారిక రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా మండలాల వ్యవసాయ శాఖ అధికారులు, ఆత్మ సిబ్బంది, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు భూమికి గుర్తింపు కార్డు



అవగాహన కల్పిస్తున్న శ్రీనివాస్

హత్నూర (సంగారెడ్డి): భూమి ఉన్న ప్రతి రైతుకు ఆధార్ లింక్‌తో పాటు భూమికార్డును ఇవ్వనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ అన్నారు. సోమవారం హత్నూర రైతు వేదికలో కేంద్ర ప్రభుత్వం నూతనంగా తెచ్చిన రైతు భూమి కార్డుపై అవగాహన నిర్వహించారు. సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ .. భూమి ఉన్న ప్రతి రైతు ఆధార్ కార్డుతో పాటు పట్టా పాస్ పుస్తకం జిరాక్స్ మీసేవ లేదా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని రైతులందరికీ ఆదర్శ అనుసంధానంతో రైతు గుర్తింపు కార్డులను జారీ చేయనుందన్నారు. ప్రతి ఒక్క రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డును పొందాలి

జహీరాబాద్: ప్రతి రైతు ఫార్మర్ గుర్తింపు కార్డును పొందాలని మండల వ్యవసాయాధికారి లావణ్య పేర్కొన్నారు. సోమవారం మండలంలోని హోతి(బి) గ్రామంలో ఫార్మర్ రిజిస్ట్రీ క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతుల నుంచి వివరాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాల కోసం రైతు గుర్తింపు కార్డును తప్పకుండా పొందాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ, రైతులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

కంగ్టి(నారాయణఖేడ్): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ రిజిస్ట్రేషన్ పీఎం కిసాన్ లబ్ధిదారులకు తప్పనిసరి అని నారాయణఖేడ్ ఏడీఏ నూతన్ కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని నాగూర్(బీ)లో ఏఈఓ సంతోష్ ఆధ్వర్యంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను ప్రారంభించారు. ఆధార్ తరహాలో రైతులకు 11 అంకెల విశిష్ట సంఖ్య (యూనికోడ్)తో గుర్తింపు కార్డు మంజూరు ప్రక్రియ సోమవారం నుంచి రాష్ట్రంలో ప్రారంభించినట్లు ఏడీఏ పేర్కొన్నారు. ఈ రైతు రిజిస్ట్రేషన్ కార్డుతో రైతు భరోసా , రైతు భీమా, పట్టా భూముల వివరాలతో కేంద్రానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. ప్రతి ఒక్కరూ రైతు రిజిస్ట్రేషన్ తప్పకుండా చేయించుకోవాలని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ తీగలకు చిక్కుకొని ఆవు మృతి

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని ముకుంద నాయక్‌తండా రైతు పరుశురాంకు చెందిన ఆవు తీగలకు చిక్కుకొని మృతి చెందింది. ఆదివారం తప్పిపోయిన ఆవు కోసం వెతుకుతుండగా శివారులోని కంచె తీగలకు చిక్కుకొని మృతి చెందినట్లు బాధిత రైతు తెలిపారు. మృతి చెందిన ఆవు విలువ లక్ష రూపాయలు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పరిహారం అందజేసి ఆదుకోవాలని కోరారు.

◆ మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో 22 మంది అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా పది మందికి రూ.1500 చొప్పున, ఇద్దరికి రూ.2000 చొప్పున, మరో పది మందికి రూ. వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

మందుబాబులకు జైలు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల పోలీస్ స్టేషన్ పరిధిలో వారం రోజులుగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ముగ్గురిని పోలీసులకు అదుపులోకి తీసుకున్నారు. వీరిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఒకరికి రెండు రోజులు జైలు శిక్ష విధించారు. మరో ఇద్దరికి రూ.2200 చొప్పన జరిమానా విధించినట్లు ఎస్‌ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

◆ డిజైర్ సొసైటీ సేవలు అభినందనీయం

జిన్నారం (పటాన్‌చెరు): ఎయిడ్స్ బాధిత అనాథ చిన్నారులను అక్కున చేర్చుకున్న డిజైర్ సొసైటీ సేవలు అభినందనీయమని బొల్లారం ఎస్‌ఐ కృష్ణారెడ్డి అన్నారు. సోమవారం సొసైటీలో వేసవి శిబిరం ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వ్యాధిగ్రస్తు చిన్నారులకు అన్ని విధాల అండగా ఉంటూ భోజనం, విద్యా, వైద్య సౌకర్యాలను ఉచితంగా అందిస్తున్న సొసైటీ నిర్వాహకుల నిస్వార్థమైన సేవలను కొనియాడారు. చివరి రోజు విద్యార్థులకు పలు ఐటీ పరిశ్రమల ఆధ్వర్యంలో బహుమతులను ఎస్‌ఐ చేతుల మీదుగా అందజేశారు. నగరానికి చెందిన జేపీఎంసీ టీం ప్రతినిధులు విద్యార్థులకు న్యూట్రిషన్ కిట్లు అందజేసి భోజన వసతిని కల్పించారు. . కార్యక్రమంలో ఐటీ పరిశ్రమ ప్రతినిధులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

◆ గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి

నారాయణఖేడ్: పట్టణానికి చెందిన సిర్గాపూర్ మండలం వాసర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ పండిట్‌గా పనిచేస్తున్న వెంకట్‌రామ్(55) గుండెపోటుతో మృతి చెందారు. మహారాష్ట్రలోని తుల్జాపూర్‌లో భవానీమాత దర్శనం చేసుకుని ఆదివారం రాత్రి తిరిగి వస్తుండగా ఛాతీలో నొప్పితో బాధపడుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు వారి కుటుంబీకులు చెప్పారు. తోటి ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

◆ ప్రవేశాలకు దరఖాస్తులకు ఆహ్వానం

జహీరాబాద్: ప్రథమ సంవత్సరం ప్రవేశం కోసం విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని దిగ్వాల్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హరీశ్వర్‌రెడ్డి కోరారు. ప్రవేశం కోసం ఈనెల 12లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

◆ 90 రోజులకు చేరిన నిరసనలు

జిన్నారం (పటాన్‌చెరు): ప్యారానగర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలు 90వ రోజుకు చేరాయి. నల్లవల్లి, ప్యారానగర్ గ్రామాల్లో రిలే నిరాహార దీక్షలు శాంతియుతంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. మూడు నెలలుగా డంపింగ్‌యార్డ్‌కు వ్యతిరేకంగా చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ధర్నాలు, రాస్తారోకోలతో నిరసనలు వ్యక్తం చేస్తున్న ప్రభుత్వం స్పందించక పోవడం దుర్మార్గమని ఆగ్రహం వక్తం చేశారు. స్థానిక ప్రజల అభిప్రాయాలకు వ్యతిరేకంగా డంపింగ్‌యార్డ్ ఏర్పాటు చేయడం ప్రజావ్యతిరేక చర్య అని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే డంపింగ్ యార్డ్ పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

◆ బాధిత కుటుంబానికి పరామర్శ

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని హుస్సేన్ నగర్ గ్రామానికి చెందిన వడగావ్ సిద్ధమ్మ ఆదివారం విద్యుత్ షాక్ తగిలి మృతి చెందిన విషయం తెలిసిందే. మృతురాలి కుటుంబాన్ని సోమవారం టీఎస్ఎస్‌సీసీడీ మాజీ చైర్మన్ వై.నరోత్తం పరామర్శించారు. సిద్ధమ్మ మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. నరోత్తం వెంట హనీఫ్, చంద్రశేఖర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, మల్లికార్జున్, ఉమేష్ పాటిల్, నాగన్న ఉన్నారు.

◆ నేటి లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఉత్సవాలు

నారాయణఖేడ్: మండలంలోని ఆకుల లింగాపూర్ గ్రామంలో మంగళవారం నుంచి ఈనెల 11 వరకు లక్ష్మీ వేంకటేశ్వర కల్యాణోత్సవాలు జరగనున్నాయి. ఈమేరకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. మంగళవారం భవానిమాతకు బోనాలు, 7న లక్ష్మీవేంకటేశ్వర కల్యాణం, బండ్ల ప్రదక్షిణ, లాజహోమం, రేణుక ఎల్లమ్మ వీధినాటకం మొదటిభాగం ప్రదర్శన ఉంటుందని అన్నారు. 8న లాజహోమం, పాచిబండ్ల ప్రదక్షణ, 9న రథోత్సవం, వీధినాటకం రెండో భాగం ప్రదర్శన, 10న పూర్ణాహుతి, అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుని పల్లకీసేవా నగర ప్రదర్శన, 11న కుస్తీ పోటీలు ఉంటాయన్నారు.

బీరంగూడలో రామ్‌రాజ్ కాటన్ షోరూం ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: బీరంగూడ కూడలిలో రామ్‌రాజ్ కాటన్ షోరూంను ఆదివారం విశ్రాంత ఐఏఎస్ అధికారి పార్థసారధి ప్రారంభించారు. రామ్‌రాజ్ అంటే నమ్మకమైన, ఆకర్షణీయమైన బ్రాండ్ అని సంప్రదాయ వస్త్రాలకు ప్రసిద్ధి అని అన్నారు. భారత దేశంలోనే కాకుండా శ్రీలంక, సింగపూర్, మలేషియా దేశాల్లోనూ రామ్‌రాజ్ వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని సంస్థ ప్రతినిధులు వివరించారు.